ప్రజాశక్తి

శుక్రవారం 25 నవంబర్ 2022 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా







నిరసన తెలుపుతున్న విద్యార్థులు, సిపిఎం నాయకులు నాగమణి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తదితరులు

'గ్రీన్‌టెక్' తొలగించాలని ఎస్‌ఎఫ్‌ఐ, సిపిఎం ఆధ్వర్యాన

విద్యార్థుల ర్యాలీ, రాస్తారోకో

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్‌పేటలోని గ్రీన్‌టెక్ కంపెనీని తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యాన విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని జడ్‌పి పాఠశాల విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ, ప్రజా సంఘాలు, సిపిఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేశారు. జిల్లా పరిషత్ పాఠశాల నుండి ర్యాలీగా వెళ్లి సచివాలయాన్ని ముట్టడించారు. అనంతరం జగ్గయ్యపేట వెళ్లే రోడ్డులో రాస్తారోకో చేశారు. గత రెండు రోజుల క్రితం గ్రీన్‌టెక్ కంపెనీ నుండి వెలువడిన కాలుష్యానికి ఆ పాఠశాల విద్యార్థులు ఐదుగురు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో పాఠశాలకు అతి సమీపంలో ఉన్న గ్రీన్‌టెక్ కంపెనీని తొలగించాలని రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. చిల్లకల్లు ఎస్ఐ చిన్నబాబు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని విద్యార్థులు, ప్రజాసంఘాల నేతలతో చర్చించారు. వారికి సర్దిచెప్పి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. తాము గ్రీన్‌టెక్ కంపెనీ వెలువడే కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని, అందువల్ల దానిని తొలగించాలని నేతలు,

(మిగతా 6లో)

'తూర్పు' బైపాస్‌పై కసరత్తు

- రూ.2 వేల కోట్ల అంచనాతో ప్రతిపాదన
- డిపిఆర్ రూపకల్పనలో 'చైతన్య'
- 40 కిలోమీటర్ల మేర నిర్మాణం
- చిన అవుటపల్లి నుండి కాజ వరకు నాలుగు లైన్లు



బైపాస్ రోడ్డు నమూనా

కృష్ణానదిపై వంతెన

ప్రజాశక్తి - గన్నవరం : విజయవాడ తూర్పు అవుటర్ బైపాస్ రోడ్డు నిర్మాణానికి కసరత్తు ప్రారంభమైంది. కష్ణాజిల్లా గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల మీదుగా ఈ బైపాస్ నిర్మాణం జరుగనుంది. చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిపై చిన అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రి వద్ద నుండి ప్రారంభమయ్యే ఈ రోడ్డు గుంటూరు జిల్లా కాజ వరకు ఉంటుంది. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగితే విజయవాడ నగరంలో కొంత వరకు ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదనలకు కేంద్ర ఉపరితల రవాణాశాఖ ఆమోదం తెలిపింది. భూసేకరణ వ్యయానికి సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా జాతీయ రహదారుల అభివద్ధి సంస్థ ఆమోదించడంతో అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. సుమారు 2 వేల కోట్లతో 40 కిలోమీటర్ల మేర తూర్పు బైపాస్ రూపుదిద్దుకోనుంది. ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) తయారీ బాధ్యతలను చైతన్య కన్సల్టెన్సీ సంస్థ తీసుకుంది. బైపాస్ వెళ్లే గ్రామాల్లో పొలాలను ఆ సంస్థ ప్రతినిధులు పరిశీలించి పూర్తిస్థాయిలో నివేదిక ఇచ్చే పని కొనసాగుతోంది. డిపిఆర్ వచ్చిన తర్వాత టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు జాతీయ రహదారుల శాఖ శాఖ సిద్ధమవుతోంది. జాతీయ రహదారిపై భారీవాహనాలు విజయవాడ నగరం, గన్నవరం మీదుగా వెళుతుండటంతో దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్యలు జఠిలమవుతూ వస్తున్నాయి. బందరు పోర్టు నిర్మాణం పూర్తయితే పోర్టు నుంచి రాకపోకలు సాగించే భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈనేపథ్యంలో ముందుగా విజయవాడ అవుటర్ పశ్చిమ బైపాస్‌కు రూపకల్పన జరిగింది. దాని నిర్మాణం వేగంగా సాగుతోంది. తాజాగా తూర్పు బైపాస్‌కు అంకురార్పణ జరుగుతోంది. ఇటీవలకాలంలో కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ విజయవాడ వచ్చినప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తూర్పు బైపాస్ నిర్మాణం గురించి ప్రస్తావించడం, అందుకు కేంద్ర మంత్రి అంగీకారం తెలిపిన విషయం తెలిసిందే. ఈ బైపాస్ కృష్ణాజిల్లా చిన అవుటపల్లి వద్ద ప్రారంభమై ఉంగుటూరు, గన్నవరం కంకిపాడు మండలాల మీదుగా గుంటూరుజిల్లా కాజ వరకు నాలుగు లైన్లుగా నిర్మించాలని నిర్ణయించారు. 40 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ బైపాస్ రోడ్డు ప్రాజెక్టులో భాగంగా కష్ణానదిపై 3,600 మీటర్ల పొడవున వంతెన నిర్మిస్తారు. సుమారు రూ.2 వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. దీని నిర్మాణం పూర్తయితే చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిపై సాధారణ

(మిగతా 6లో)



మహాసభలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్

దళితులపై దాడులను అరికట్టాలి

- కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా మహాసభ తీర్మానం
- నూతన అధ్యక్ష కార్యదర్శులుగా జి.క్రాంతికుమార్, జి.నటరాజు

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, దళితుల అసైన్డ్ భూమలను ఇళ్ల స్థలాల పేరుతో తిరిగి తీసుకోవడాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాలను కోరుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాటం (కెవిపిఎస్) ఎన్‌టిఆర్ జిల్లా 6వ మహాసభ తీర్మానించింది. కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా 6వ మహాసభ మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులోని హరి గార్డెన్స్ (గుడిసె నాగరాజు, మోహన్ రావు ప్రాంగణం)లో గురువారం జరిగింది. ముందుగా కెవిపిఎస్ పతాకాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు కుటుంబరావు ఆవిష్కరించారు. అనంతరం కుటుంబరావు అధ్యక్షతన జరిగిన మహాసభలో పలు తీర్మానాలను





అధ్యక్ష కార్యదర్శులు క్రాంతికుమార్, నటరాజు

(మిగతా 6లో)

ప్రహసనంగా ధాన్యం కొనుగోళ్లు

- రైతులే ఆరబెట్టుకోవాలంటున్న అధికారులు
- వసతుల లేమితో అవస్థలు
- తేమ శాతం నిర్ధారణలో నిర్లక్ష్యం ?
- కొరవడిన క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ఎన్టీఆర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ గందరగోళంగా మారింది. వివిధ సమస్యల తలెత్తతుండటంతో ఈ ప్రక్రియ సవ్యంగా ముందుకు సాగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా గోనె సంచులు, వాహనాల రవాణా చార్జీలు, హమాలీలు, టెక్నికల్ అసిస్టెంట్లు తేమ పరీక్షలను సరిగా చేపట్టక పోవడం, సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనలకు వెళ్లకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఖరీఫ్ సీజన్లో జిల్లావ్యాప్తంగా సుమారు 1.15 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సుమారు 3 లక్షల టన్నుల నుంచి 3.5 లక్షల టన్నుల వరకు ధాన్య దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఇటీవలే కోతలు ప్రారంభమయ్యాయి. డిసెంబరు వరకు ఇవి కొనసాగే అవకాశం ఉంది. దాదాపు అన్ని మండలాల్లో హార్వెస్టింగ్ ప్రారంభమైంది. ఎక్కువగా బిపిటి 5204, పింటియు 1061 రకాలను సాగు చేశారు.

తేమ శాతంతో సతమతం

కోతల అనంతరం ధాన్యం తేమ విషయంలో రైతులు సతమతం అవుతున్నారు. పంటను కోసిన తర్వాత రైతేలే ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని అధికారులు చెబుతున్నారు. తేమ శాతం 17 వచ్చేంత వరకు ఆర బెట్టకోవాలంటున్నారు. మరోవైపు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి సరిపడా స్థలం, టార్పాన్ పట్టాల సౌకర్యం వంటి సమస్యలను రైతులు ఎదుర్కొంటున్నారు. దీంతో 17 శాతం తేమ శాతానికి చేరుకోవడం గగనంగా మారింది. దీనికితోడు వాతావరణం తరచూ మబ్బులు పట్టి ఉండడం, వర్షాలు కురవడం కూడా రైతులకు శాపంగా మారింది.

టెక్నికల్ అసిస్టెంట్ల అశ్రద్ధ

ప్రతి ఆర్‌బికెకు ఒక పిపిసి ఏర్పాటు చేశారు. సుమారు 169 మంది సాంకేతిక సహాయకులు ఉన్నారు. అయితే ధాన్యం తేమను పరీక్షించడంతో టెక్నికల్ అసిస్టెంట్లు అశ్రద్ధ వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వీరు నిర్ధారించిన తేమ శాతాన్నే నిర్ధారిస్తారు. మరోసారి తేమను పరీక్షించే అవకాశం ఉండదు. తేమ శాతం నిర్ధారణ సరిగా జరగకపోవడంతో ధాన్య రేటు తగ్గిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ధాన్యం కొనుగోలుపై జిల్లా వ్యవసాయ, కోఆపరేటివ్, మార్కెటింగ్, సివిల్‌సప్లైస్, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ట్రాన్స్‌పోర్టు, లీగల్ మెట్రాలజీ తదితర అధికారులకు ఇది వరకే ఆదేశాలు అందాయి. అయితే క్షేత్రస్థాయిలో వీరి పర్యవేక్షణ కొరవడుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.



అంబేద్కర్ కమ్యూనిటీ స్థలంలో కట్టడాలు నిలిపేయాలని నిరసన

ప్రజాశక్తి-కంచికచర్ల

స్థానిక చెవిటికల్లు రోడ్డులో అంబేద్కర్ కాలానీకి చెందిన అంబెద్కర్ గ్రౌండ్ లో కేవలం మంచినీటి ట్యాంకు, లైబ్రరీకి మినహా మరే ఇతర కట్టడాలు చేయవద్దని ఆ కాలనీ వాసులు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిలసన కార్యక్రమంలో పాల్గొన్న బియస్పీ ఎంపిటిసి బర్రె ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ సుమారు 3 దశాబ్దాల క్రితం ఆ కాలనీ వాసుల సామాజిక వినియోగం కోసం ఆ స్థలాన్ని కేటాయించారన్నారు. కమ్యూన్యూటీ భూమిలో కొంత భాగం ఇటీవల సచివాలయం భవనం నిర్మించారన్నారు. అప్పడు కాలనీ వాసులు అభ్యంతరం తెలుపగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక. జగన్మోహన్ రావు భవిషత్తులో ఇంకెప్పుడు ఈ గ్రౌండ్లో ఏ ఒక్క బిల్డింగ్ నిర్మాణం చేపట్టబోమని చుట్టూ ప్రహరీ కట్టించి, లోపల లైబ్రరీ కట్టి చదువుకునే వారికి ఉపయోగపడేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. కానీ నేడు మరల అక్కడ రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి ఇటీవల మండల ఇంజనీరింగ్ అధికారులు కొలతలు తీసుకున్నారని, దీనిని ఆపాలని వారు కోరారు. అనంతరం తహశీల్దార్ వి రాజకుమారి కి వినతిపత్రం అందజేశారు..ఈ కార్యక్రమంలో కొంకా. విగ్నేశ్వర రావు, మైలా ప్రతాప్, బిల్లా. వంశీ, అమర్లపూడి. వెంకట్రావు తదితరులు పాల్గిన్నారు.



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుడు రంగనాథ్‌కు పితృవియోగం



ప్రజాశక్తి -గంపలగూడెం : మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యా యుడు నేరెళ్ల రంగనాథ్ తండ్రి సుబ్బారావు (72) గురు వారం ఉదయం మృతిచెందారు. వృద్ధాప్యంతోపాటు అనారోగ్యం తోడు కావడంతో ఆయన మతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. టిపిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు బూరుగు జమలయ్య, మూడు మండలాల ఉపాధ్యాయ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కుంభగిరి రాంబాబు, పి ఆర్ టి యు మండల అధ్యక్ష కార్యదర్శులు మెరుగు జయ సీలన్ రావు, అట్లూరి సుధాకర్ రెడ్డి, డిపిఆర్‌టియు అధ్యక్ష కార్యదర్శులు నల్లగొండ నరసింహారావు, ఏవి నరసింహారావు, యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు చిల్లపల్లి రమేష్, కుంభగిరి మోహన్ రావులు మతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులు నివాళులతో పాటు సానుభూతిని ప్రకటించారు



ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జిల్లా ప్రజా పరిషత్ వారి సౌజన్యంతో జగ్గయ్యపేట మండలములోని మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివద్ధి అధికారి టి ఎస్ జయచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా జయచంద్ర మాట్లాడుతూ గ్రామాలలోని మహిళలకు ఇది చక్కని అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమములో జన శిక్షణా సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ మాట్లాడుతూ స్త్రీలు స్వాలంభన దిశగా అడుగులు వేయటానికి తమ ఉపాధి నిమిత్తం ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

డొంక రోడ్ల అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి కంచికచర్ల

కంచికచర్ల మండలం వేములపల్లి గ్రామంలో 4 లక్షల రూపాయల వ్యయం తో రెండు డొంక రోడ్ల అభివృద్ధి పనులకు మండల పరిషత్ అధ్యక్షులు షేక్ మాలక్ బషీర్ గురువారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు మండల పరిషత్ నిధులను ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తున్నట్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి సర్పంచ్ నరసింహారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామకష్ణ, వేములపల్లి ఎంపీటీసీ శీను పెండ్యాల ఎంపీటీసీ 2 బడేహాజరత్ , పంచాయతీ కార్యదర్శి వనిత, ఏఈ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న యంపిపి తదితరులు

ఒకే కాన్పులో ముగ్గురు కవలలు జననం

ప్రజాశక్తి-నందిగామ



ఒకే కాన్పులో ముగ్గురు కవల పిల్లలు జన్మించిన అరుదైన సంఘటన నందిగామ పట్టణంలో గురువారం పద్మశ్రీ హాస్పటల్లో జరిగింది. నందిగామకు చెందిన షేక్ అమీనా భర్త సర్దార్‌లు భార్యభర్తలు. అమీనా పురిటి నొప్పులతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లగా ఆమెకు బ్లడ్ శాతం తక్కువగా ఉన్నప్పటికీ వైద్యులు సకాలంలో స్పందించి మానవతాదృక్పథంతో డబ్బులు తీసుకోకుండా సర్జరీ చేశారు. నిమిషాల వ్యవధిలోనే తొలుత ఇద్దరు మగ శిశువులు. ఒక ఆడ శిశువు జన్మించారు. ఒకే కాన్పులో ముగ్గురు కవల పిల్లలు జన్మించటంతో ఆకుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

మహాసభ జయప్రదం చేయాలని కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-కంచికచర్ల



ఈ నెల 26 న స్థానిక ఎన్జీవో హెూంలో జరిగే సిఐటియు మండల మహాసభ ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు యన్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం కంచికచర్ల లో సిఐటియు అనుబంధ రంగాలను కార్మికులతో కలిసి కర పత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 న జరిగే మండల మహాసభ లో ముఖ్య అతిథులుగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కటారపు.గోపాల్ హాజరవుతారన్నారు. సిఐటియు 11వ జిల్లా మహాసభలు డిసెంబర్ 15 , 16 తేదీల్లో విజయవాడలో జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు బి.భూషణం, ఉపాధ్యక్షులు షేక్.ఖాసీం, పండ్ల వర్తక సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ పట్టణంలోని 13,14 వార్డులలో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు నందిగామ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు గురువారం శంకుస్థాపన చేశారు . ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నందిగామ పట్టణంలో గడపగడపకు విజయవంతంగా జరుగుతోందని అన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గ్రామ లేదా వార్డు సచివాలయ పరిధికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నారని ఆ నిధులతో ప్రజలకు అవసరమైన అభివద్ధి పనులు చేపడు తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం , కౌన్సిల్ సభ్యులు గద్దె శేషు కుమారి, నాదెండ్ల నరేంద్ర , గద్దె రమేష్ , నరసింహారావు, మారం అమరయ్య , షేక్ ఖాలిక్, పాకాలపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు .

పెయ్య దూడల ఉత్పత్తి పథకంపై అవగాహన

ప్రజాశక్తి -తిరువూరు

తిరువూరు మండలం, మల్లేల గ్రామ సచివాలయంలో పెయ్య దూడలు ఉత్పత్తి పథకం ద్వారా ఆడ దూడలు ఉత్పత్తి చేసే విధానాన్ని పశుసంవర్ధక శాఖ ఎడి కిషన్ గురువారం రైతులకు వివరించారు. పశు వులకు కత్రి మ గర్భధారణ ద్వారా పెయ్య దూడలు ఉత్పత్తిని చేసుకునేందుకు ప్రభుత్వం పెయ్య దూడలు ఉత్పత్తి పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తుందని చెప్పారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కలకొండ రవికుమార్, సర్పంచ్ వంగూ రు మరియమ్మ, ఎం.గోపాలకష్ణ, విఎ ల్‌ఓ, సచివాలయం కార్యదర్శి సి.హె చ్.అంజలీదేవి. రైతులు పాల్గొన్నారు.

'ఇదేమి ఖర్మ'పై కార్యచరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని గండ్రాయి గ్రామంలో కోటూరు సత్యనారాయణ ప్రసాద్ నివాసంలో గురువారం ఇదేమి ఖర్మ కార్యక్రమం కార్యాచరణ గురించి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ ఇంచార్జి శ్రీరామ్ రాజగోపాల్, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సభ్యులు ముల్లంగి రామకష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కట్టా నరసింహారావులు పాల్గొని ఈకార్యక్రమ విజయవంతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పల్లెబోయిన నాగరాజు, మాజీ ఎంపీటీసీ శీతల శ్రీను, బోయిన శ్రీను, బండారుపల్లి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి శ్రీను (సీఎం), కొత్తపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను

గడపగడపకూ మనప్రభుత్వం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట-3 సచివాలయం పరిధిలోని 4 వార్డులో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లా డుతూ విద్యా రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చి మనబడి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, హఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు గురువారం పేదలకు వస్త్ర దానం, పలువురు పేదలకు విద్య, వైద్య సహాయాన్ని అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు, సోదరుడు రాజారావుల మాతృమూర్తి పుణ్యతిధి వర్ధంతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేద విద్యార్థికి 5 వేల రూపాయలు, వైద్య సాయం నిమిత్తం ఒకరికి 5 వేల రూపాయలు, 25 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రాజారావు, శ్రీదేవి, భారతి, సుప్రియ ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా)

గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సేవలకు సంబంధించి పెండింగ్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి స్పందన అర్జీలు, సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు, గృహనిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుండి విసిలో కలెక్టర్ పాల్గొని జిల్లాలో స్పందన అర్జీల పరిష్కారం, గృహనిర్మాణ ప్రగతి తదితర అంశాల పురోగతి కలెక్టర్ వివరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న లే అవుట్లో పేదలందరికి గృహాలు పథకం కింద జిల్లాలో గృహనిర్మాణం వేగవంతం చేయుటకు ప్రతి శనివారం హౌసింగ్ డే గా పాటించాలని, మండల అధికారులతో కూడిన బందాలు ప్రతి శనివారం కనీసం రెండు లే అవుట్ సందర్శించి గృహ నిర్మాణం పురోగతి, సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయలన్నారు. బేస్మెంట్ లెవల్ ఆపై నిర్మాణ స్థాయిలో ఉన్న గృహాలన్ని డిశంబర్ ఆఖరు నాటికి పూర్తి చేయాలని, ఎంఎవై గ్రామీణ కింద ఈ నెలాఖరులోగా అన్ని గ్రౌండింగ్ కావాలని అధికారులకు సూచించారు. డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, డిఆర్డిఎ పిడి సిఎస్ఆర్ ప్రసాద్, ఐసిడిఎస్, పిడి ఎస్. సువర్ణ, డిఎల్ డిఎ సుబ్బారావు, సిపివో వై. శ్రీలత, డిపివో నాగేశ్వరా నాయక్, ఎడి సర్వే గోపాలరాజ్ పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద కేంద్రాలు నిర్వహణపై దృష్టి సారించాలి : కలెక్టర్

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాబివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది గురువారం అమరావతి సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష, ఉపాధిహామీ, గ్రామ సచివాలయ, ఆర్ బీకే, హెల్త్ క్లీనిక్ భవనాల నిర్మాణం, జగనన్న - స్వచ్ఛ సంకల్పం తదితర పథకాల ప్రగతి జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

జిల్లాలో 491 గ్రామ పంచాయతీలకు గాను 472 చెత్తనుండి సంపద కేంద్రాలు (ఎబ్ల్యూపీసీ) ఇప్పటికే నిర్మించగా మిగతా నిర్మాణాలు సత్వరమే పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలులో ప్రభుత్వ లక్ష్యం నెరవేరేట ఆయా గ్రామ సర్పంచ్లను భాగస్వామ్యులను చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ వీసీలో జడ్పి సిఇఓ జి. శ్రీనివాసరావు, డ్వామా పీడి జివి. సూర్యనారాయణ, డిపిఓ నాగేశ్వరనాయక్, పంచాయత్ రాజ్ ఎస్ఇ ఈరాస్వామి, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఇ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల పాత్ర పెరగాలి

ప్రజాశక్తి-గన్నవరం



ప్రభుత్వ పథకాలను అర్హులకు చేర్చడంలో డిజిటల్ అసిస్టెంట్ల పాత్ర మరింత పెరగాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్స్ సమావేశం జరిగింది. శేషగిరిరావు మాట్లాడుతూ ఏపీ పోర్టల్ సర్వీసెస్ గురించి వివరించారు. వివిధ పథకాలలో అందులో ముఖ్యంగా కళ్యాణమస్తు, షాది తోఫా పథకం అమలును వివరించారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఇళ్ల నిర్మాణం పూర్తి

- డ్వామా పీడీ జివి సూర్యనారాయణ



మాట్లాడుతున్న డ్వామా పీడీ జివి సూర్యనారాయణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

డివిజన్ స్థాయి అధికారుల నుంచి గ్రామ స్థాయి సిబ్బంది వరకు అందరు సమన్వయంతో కలిసికట్టుగా పని చేసి నూరు శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, డ్వామా పిడి ,మచిలీపట్నం మండల ప్రత్యేకాధికారి జివి సూర్య నారాయణ సూచించారు.గురువారం హౌసింగ్, ఇంజనీరింగ్ సిబ్బందికి మచిలీపట్నం లోని డ్వామా మీటింగ్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఔట్లలో మౌలిక సదుపాయల కల్పన కోసం అవసరమైన అంచనాలను రెవెన్యూ అధికారులతో కలిసి తక్షణమే రూపొందించి లక్ష్య సాధనకు ప్రణాళికలు రచించాలన్నారు. అవసరమైన లబ్దిదాలకు రుణ సదుపాయాలు తక్షణమే కల్పించేలా చూడాలని గ్రామీణ అభివృద్ధి అధికారులను కోరారు. సమావేశంలో డీ ఆర్ డి ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్, డివిజన్, సబ్ డివిజన్, మండల స్థాయి ఇంజినీరింగ్ అధికారులు, హౌసింగ్ డీఈవో లు తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రిక ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

9న బీమా పోర్టల్‌ను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా)

ఐఆర్‌డిఏఐ ప్రవేశ పెట్టిన బీమా సుగం పోర్టల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఐఆర్‌డిఏఐ కార్యాలయం వద్ద డిసెంబర్ 9 తేదీన జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మచిలీపట్నం ఎల్‌ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా గోడ పత్రిక ను ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బ్రాంచ్ అధ్యక్షులు కె. ఆర్. కె. గుప్తా, కార్యదర్శి పి. భాస్కర్ రావు ,గౌరవ అధ్యక్షులు కె. రాజా రావు మరియు సి డబ్ల్యు సి మెంబెర్ కె. ఉదయలక్ష్మి , ఉపాధ్యక్షులు యమ్. ప్రభాకర్ రావు గ, జి. శ్రీనివాసరావు రావు, మౌలాలి, కృష్ణ మోహన్ గ, శ్రీకాంత్ , జి. ఎన్. మల్లేశ్వరి, ఎ. నాగవేణి, యు. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



'స్పందన'లో ఫిర్యాదు చేసినా తొలగించని వ్యర్థాలు

ప్రజాశక్తి-పెడన

పెడనలో 11 వార్డు చెంచుల కాలనీలో ఇళ్ల మధ్యలో ప్లాస్టిక్ వ్యర్థాలను నిల్వచేసే గోడౌన్ గా మార్చుకున్న నేపథ్యంలో ఈ వ్యర్థాలతో తరచూ రోగాల బారిన పడుతున్న కాలనీ వాసులు ఈనెల 14తారీఖున 'స్పందన'లో కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటివరకు మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కలెక్టర్ కి సైతం ఈ సమస్యను విన్నవించుకున్న పరిష్కారం కావడం లేదు అని, కలెక్టర్ ఆదేశాల సైతం తుంగలో తొక్కడాన్ని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలతో డెంగ్యూ,మలేరియా వంటి విష జ్వరాలతో బాధపడుతున్నామని కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల మధ్యలో వ్యర్థాలను తొలగించి దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలుకు వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ రైతుసంఘం నాయకులు తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన నగదును రైతుల ఖాతాల్లో జమచేయాలని అన్నారు. ఎకరాకు 26 క్వింటాల్ ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం శోచనీయమని, వాతావరణం అనుకూలించడం వల్ల ఈ ఏడాది దిగుబడులు 30 నుంచి 35 క్వింటాళ్లకు పెరిగాయన్నారు. కాబట్టి రైతుల దగ్గర నుంచి 32 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాలని వినతిపత్రం పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు నాయకులు కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు బంటుమిల్లి మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్ సుజ్ఞాన జనార్ధన్ సమ్మెట నాంచార్య తదితర రైతులు ఉన్నారు.



వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

సాయం అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మండలంలోని కవుతరం 1వ వార్డు నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన మేడ విజయ్ పూరిల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. గుడ్లవల్లేరు లయన్స్ సభ్యుల సహాయంతో వారి కుటుంబానికి 8500 రూపాయల నగదు లయన్స్ సేవ భవనంలో గురువారం సహాయం అందించినట్లు లయన్స్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి-పెడన

పెడనలో శ్రీ బొడ్డు నాగయ్య జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న 100 మంది విద్యార్థులకు 100 రోజుల మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు కొల్లూరి చారిటబుల్ ట్రస్ట్ (కెసిటి) వ్యవస్థాపకులు కొల్లూరి చిన్నా పదిరోజులపాటు భోజనాలు ఏర్పాటు చేశారని ప్రిన్సిపాల్ పిబి సాల్మన్‌రాజు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారంతో 10 రోజులు ముగుస్తున్న సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొల్లూరి చిన్నాను లెక్చరర్స్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కెసిటి సభ్యులు కొల్లూరి రాజా కొల్లూరి రాధాకృష్ణ, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి జవాజి నాగు కార్యవర్గ సభ్యులు జల్లూరి సత్యనారాయణ సభ్యులు జూపూడి భాస్కర్ రావు సేవకుడు కాగిత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




వ్యకాస రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



గోడ పత్రిక ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గుడివాడ : వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 8,9,10వ తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరుగుతాయని కార్మిక సంఘాలన్నీ పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురాల రాజేష్ కోరారు. గుడివాడలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ భూ సమస్యలపై వివిధ రూపాల్లో వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. ముఖ్యంగా సంపన్న వర్గాలు ఆక్రమించుకున్న ప్రభుత్వానికి చెందిన మిగులు, అసైన్డ్, సీలింగ్ భూములపై కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలను నిర్వహించామన్నారు. అంతేకాకుండా కుల వివక్ష వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం అనేక పోరాటాలను నిర్వహించామన్నారు. జంగారెడ్డిగూడెంలో జరిగే ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా బందా కారత్, అఖిలభారత అధ్యక్షుడు ఏ విజయ రాఘవన్, కార్యదర్శి బి. వెంకట్, రైతు సంఘం నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సేలం ప్రకాష్ రావు ఉపాధ్యక్షులు వై మధు, ఆంజనేయులు తిరుపతిరావు, మేరిమా, సహాయ కార్యదర్శులు వెంకటేశ్వరరావు, ఎండి బారీ, ఆదిశేషు, మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రుణాలు : జెసి



ప్రజాశక్తి-విజయవాడ: జగనన్న పాలవెల్లువ పథకం అమలు జరుగుతున్న మండలాలలోని యంపిడివోలు, తహశీల్దారు, ఏపియంఏలు, పశువైద్యులు, రూట్ ఇన్‌చార్జులతో జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ ఆమె కార్యాలయం నుండి గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని జి కొండూరు, మైలవరం, గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, ఏ కొండూరు మండలాలలో జగనన్న పాలవెల్లువ పథకం అమలు జరుగుతుందన్నారు. ఈ మండలాల్లో 96 పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయని, వీటి ద్వారా రోజుకి ఆరు వేల లీటర్ల పాలు సేకరించడం జరుగుతుందన్నారు. ఈ పాల సేకరణ తక్కువగా జరుగుతున్నందున పాల సేకరణ పెంచే విధంగా మహిళా పాడి రైతులతో సచివాలయ సిబ్బంది, మండల అధికారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. మహిళా పాడి రైతులకు కెడిసిసి బ్యాంకు ద్వారా వర్కింగ్ క్యాపిటల్‌గా 30 వేల రూపాయల రుణాలను ఎక్కువ మంది మహిళా రైతులకు మంజూరు చేయాలన్నారు. ఎయంయుఎల్ పాల కేంద్రాలకు పాల సేకరణ స్థాయిని పెంచేందుకు తగు సూచనలను జాయింట్ కలెక్టర్ చేశారు. ప్రైవేట్ డైరీలకన్న ఆటోమెటిక్ బల్క్ యూనిట్ కేంద్రాల (ఎయంయుఎల్) సంస్థ వారు మెరుగైన పాల ధర గరిష్ఠంగా లీటర్‌కు రూ.82.50 ఇస్తున్నారని ప్రతీ గ్రామంలోని పాడి రైతులకు తెలియజేసి జగనన్న పాల వెల్లువ కేంద్రాలలో పాల సేకరణ పెంచే విధంగా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తిరువూరు ఆర్‌డివో వైవి ప్రసన్నలక్ష్మి, డిఆర్‌డిఏ పిడి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కెబిఎన్‌లో ముగిసిన శిక్షణ



ప్రజాశక్తి-వన్‌టౌన్: వన్‌టౌన్ కొత్తపేటలో గల పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 21వ తేదీ నుండి 24వ వరకూ బ్రెయినోవిజన్ సంస్థ ఆధ్వర్యంలో ఫుల్ స్టాక్ వెబ్ డెవలప్‌మెంట్ నిర్వహించిన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించటానికి బ్రెయినో విజన్ సంస్థ సిఇఓ గణేశ్‌నాగ్ పాల్గొని మాట్లాడుతూ ఫుల్ స్టాక్ వెబ్ డెవలప్‌మెంట్ అంశంపై నిర్వహించిన బూట్‌క్యాంప్ మరియు హ్యాక్‌థాన్ ద్వారా శిక్షణ తరగతుల్లో విద్యార్థులు శిక్షణ పొందటం ఎంతో ముఖ్యమన్నారు. హ్యాక్‌థాన్‌లో భాగంగా విద్యార్థులతో ఈ కామర్స్ వెబ్‌సైట్ డెవలప్‌మెంట్ పోటీలను కూడా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వతాంజలి శాస్త్రి, సిఎస్‌ఇ విభాగాధిపతి డాక్టర్ డి.దుర్గాప్రసాద్, ఐటి విభాగాధిపతి పి.శిల్పా, ఏఅండ్ఎంఎల్ విభాగాధిపతి ఎన్. మహాలక్ష్మి, డేటా సైన్స్ విభాగాధిపతి జి.పద్మజా పాల్గొన్నారు.

4 వరకు ధర్మ ప్రచార రథయాత్ర

ప్రజాశక్తి-వన్‌టౌన్: భవానీ దీక్షలు-2022, హిందూ ధర్మప్రచారం నిమిత్తం ఈ నెల 25 నుండి డిసెంబర్ 4వ తేదీ వరకూ అమ్మవారి ధర్మ ప్రచార రథయాత్ర నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ గురువారం తెలిపారు. శ్రీ అమ్మవారి ధర్మప్రచార రథమును విజయవాడ నుండి శ్రీకాకుళం జిల్లా వరకు వివిధ గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించేందుకు వైదిక కమిటీ సూచనల మేరకు అమ్మవారి ధర్మ ప్రచార రథయాత్ర కొనసాగుతుందని తెలిపారు.

నేడు, రేపు క్రీస్తు విజ్ఞాన సువార్త సభలు

ప్రజాశక్తి-నందిగామ: ఈ నెల 25, 26 తేదీల్లో కేతవీరునిపాడు గ్రామంలో క్రీస్తు విజ్ఞాన సువార్త సభలు జరుగుతాయని కేతవీరునిపాడు చర్చ్ దైవ సేవకులు బి.పరిశుద్ధరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రుద్రవరం సంఘ కాపరి కొండూరు స్వామి అధ్యక్షతన బైబిల్ విజ్ఞాన కళాశాల నందిగామ వారి ఆధ్వర్యంలో జెబిఆర్పి కేతవీరునిపాడు వారు నిర్వహించే ఈ సభలకు హైదరాబాద్ మియాపూర్ సబిటి ప్రిన్సిపాల్ దైవ సేవకులు కింగ్ శ్రీను, బిఒయుబి డిప్యూటీ డైరెక్టర్లు బి.రాజేంద్రబాబు, పి.వి.రత్నం హాజరవుతున్నారని తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి గ్రామ శివారు పొలాల్లో గురువారం పేకాట నిర్వహించబడుతున్నట్లు రాబడిన సమాచారంతో జగ్గయ్యపేట సిఐ ఎ నాగమురళి పర్యవేక్షణలో చిల్లకల్లు యస్ఐ సిహెచ్ చిన్నబాబు సిబ్బందితో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 13 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,27,300 నగదు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



అన్నదానం మహాదానం : టిడిపి

ప్రజాశక్తి-వన్‌టౌన్: అన్ని దానాల్లో కన్నా అన్నదానం మహాదానమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. కేశినేని ఫౌండేషన్ ట్రస్ట్ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొబైల్ అన్న క్యాంటీన్ నాగోతి రామారావు ఆధ్వర్యంలో 30వ రోజు గురువారం 47వ డివిజన్ కుండల మార్కెట్, కె.ఎల్ రావు నగర్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగుల్ మీరా, కొట్టేటి హనుమంతరావు, సాదరబోయిన ఏడుకొండలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : విష్ణు



ప్రజాశక్తి-విజయవాడ: పేదల అభివృద్ధికి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. గురువారం 59వ డివిజన్ అజిత్‌సింగ్ నగర్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎండి షాహినా సుల్తానాతో కలిసి ప్రజల వద్ద నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత మూడేళ్లలో సచివాలయ పరిధిలో రూ.8.69 కోట్ల సంక్షేమాన్ని అందజేసినట్లు మల్లాది విష్ణు వెల్లడించారు. 497 మందికి జగనన్న ఇంటి పట్టాలు మంజూరు చేసినట్లు వివరించారు. సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల నిధులతో ఈ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలియజేశారు. ఒక్కో నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.2 కోట్ల నిధులతో సెంట్రల్‌లో ప్రజల తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అంబేద్కర్, డీఈ రామకృష్ణ, ఏఎంఒహెచ్ రామకోటేశ్వరరావు, సిడిఓ జగదీశ్వరి, నాయకులు హఫీజుల్లా, దేవిరెడ్డి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి-వన్‌టౌన్

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలోని దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకర్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

నేడు బహిరంగ వేలం

ప్రజాశక్తి-విజయవాడ

అధికారికంగా స్వీకరించని, గుర్తించబడని పార్సిల్స్‌ను ఈ నెల 25న పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రాంగణంలోని పార్సిల్ ఆఫీసు వద్ద ఈ నెల 25న బహిరంగ వేలంను నిర్వహించడం జరుగుతుందని, దీనిలో ఔత్సాహిక వేలం పాటదారులు పాల్గొనాలని ఎన్‌టిఆర్ జిల్లా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) జెవిఎ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... విజయవాడ పార్సిల్ ఆఫీసు వారు అధికారికంగా తీసుకోనబడని, గుర్తించబడని సరుకును శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్సిల్ ఆఫీసు వద్ద వేలం వేయడం జరుగుతుందని అన్నారు.

అబ్బురపరిచిన బజాజ్ షో

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: నున్నలోని వికాస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులను షో స్టాపర్ కార్యక్రమం అబ్బురపరిచింది. ప్రముఖ టూవీలర్ తయారీ కంపెనీ బజాజ్ కు చెందిన పల్సర్ ఎన్ఎస్ 125 స్పోర్ట్స్ మోడల్ ద్విచక్ర వాహనంతో నిపుణులు పలు రకాల స్టంట్లు చేసి విద్యార్థులను అలరించారు. నిపుణులు పల్సర్ ద్విచక్ర వాహనంతో చేస్తున్న విన్యాసాలకు విద్యార్థులు చప్పట్లతో హోరెత్తించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కొత్త పల్సర్ ఎన్ఎస్ 125 ప్రత్యేకతలను వివరించారు. స్పోర్ట్స్ బైక్‌లపై యువకులకు ఉన్న మక్కువ దృష్టిలో ఉంచుకొని అనుభవజ్ఞులైన నిపుణుల సారథ్యంలో కొత్త పల్సర్ ఎన్ఎస్ 125 ద్విచక్ర వాహనాన్ని తయారు చేశారని కొత్త డిజైన్, కొత్త ఇంజన్, వివిధ రకాల కొత్త ఫీచర్లు ఉన్నాయని తెలిపారు.





స్కౌట్ విద్యార్థులు దృఢంగా ఉండాలి

ప్రజాశక్తి-భవానీపురం: స్కౌట్ విద్యార్థులు శారీరకంగా దృఢత్వంగా ఉండాలని నేతాజీ హైస్కూల్ కరస్పాండెంట్ కె.తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక భవానీపురంలో గల నేతాజీ హైస్కూల్‌కు చెందిన స్కౌటు విద్యార్థులు గురువారం కొండపల్లి ఖిల్లాకు హైక్‌కు వెళ్లారు. ఈ హైక్ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ కె.తిరుపతిరెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైక్ వల్ల విద్యార్థుల్లో శారీరక దఢత్వం, తోటి విద్యార్థుల పట్ల స్నేహ సౌభ్రాతృత్వం పెంపొందించుకోవాలన్నారు. నూతన విషయాల పట్ల అవగాహన, చారిత్రక ప్రదేశాలపై సమగ్ర జ్ఞానం, స్థానిక కళా సంస్కృతులపై అవగాహన కలుగుతాయన్నారు. విద్యార్థులు ఖిల్లాపై గల దర్బారు హాలు, రాణీ మహల్, మార్కెట్ యార్డు, ఆయుధాగారం, కారాగారం మొదలైన కట్టడాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్లు దారం ప్రసాద్, కెపిఆర్‌బి శర్మ, బియస్ వరకుమార్, ఎం.అఖిల్, ఎ.అరుణ్, స్కౌటు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారు : జనసేన

ప్రజాశక్తి-వన్‌టౌన్



సంక్షేమ పాలన ముసుగులో రాష్ట్రంలోని సంపద అంతా దోచుకుంటున్నారని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకటమహేష్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డికి పవన్ కళ్యాణ్ ఫోబియో పట్టుకుందని పేర్కొన్నారు. అందుకే ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో జనసేన పార్టీ, పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేస్తున్నారని, తన పాలనపై నమ్మకం ఉంటే విమర్శలు ఎందుకని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ వైసిపి ముక్త ఆంధ్రప్రదేశ్ అనే నినాదంతో పాటు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వమని చెప్పడం వల్లే జగన్‌కి రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయం పట్టుకుందని పేర్కొన్నారు. అందుకే పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

మార్కెట్లో తేజా కార్గో ఆటోలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్



వాహనాలు కొనుగోలు చేసేందుకు వాహనదారులకు సులభతర పద్ధతిలో రుణాలు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ యు.వి.రజనీ కాంత్ అన్నారు. రామవరప్పాడులోని ఒక హోటల్‌లో అమృత ఆటోమొబైల్స్ ఆధ్వర్యంలో తేజా హ్యాండీ ప్యాసింజర్, కార్గో ఆటోలను మార్కెట్లోకి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీతో తయారు చేసిన ఈ ఆటోలు ప్రజాదరణ పొందాలని ఆకాంక్షించారు. ఎంఎల్ఆర్ ఆటో లిమిటెడ్ కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వైవిఎస్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆటో రంగంలో మొట్టమొదటిసారిగా అనేక నూతన ఫీచర్లు తేజా ఆటోలో ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఎటువంటి ఇబ్బంది లేని సెన్సార్, రేడియేటర్‌తో పని లేకుండా కంప్యూటర్ చెకింగ్ అవసరం లేకుండా తాడుతో ఇంజన్ స్టార్ట్ చేసే సౌకర్యం ఉందన్నారు. ఈ సౌకర్యం ఆటో డ్రైవర్లకు ఎంతగానో దోహద పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమృత ఆటోమొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని తొర్రకుంటపాలెంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు గురువారం పట్టణ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ తొర్రగుంటపాలెంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని యువ నాయకులు, కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ తెలియజేయడంతో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. కౌన్సిలర్‌గా ఎన్నికైన తొలిరోజు నుంచి వార్డు అభివృద్ధిపై దృష్టి పెట్టి పైపులైన్, విద్యుత్, డ్రెయినేజీ వంటి సమస్యలు తన దృష్టికి లైటింగ్ సమస్య, డ్రైనేజ్ సమస్య ఇలాంటివి చాలా వరకు కౌన్సిల్ దష్టికి తీసుకువచ్చారన్నారు. తొర్రకుంటపాలెం అభివృద్ధికి కృష్ణప్రసాద్ నిరంతరం కృషిచేస్తున్నారని వివరించారు. జగ్గయ్యపేట నియోజక వర్గ అభివృద్ధి కోసం తండ్రికి తగ్గ తనయుడుగా ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్సీపీ అధ్యక్షుడు ఆకుల బాజీ, కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్సీపీ నాయకులు పుసాల పుల్లారావు, కాశీ కిషోర్, సిద్దేనేని నాగు, కాసర్ల బాలస్వామి, పోతురాజు రంగయ్య, మక్కపేట శ్రీను, మస్తాన్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయొద్దు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని ధరణికోట వారి భవనంలో గురువారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రత్యేక సమావేశం జరిగింది. రిటైర్డ్ డిఇ శేషగిరిరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సెక్రెటరీ ఎస్ ఏ ఘని, గౌరవ అధ్యక్షులు ధరణికోట వెంకటరమణ మాట్లాడారు. శేషగిరిరావు మాట్లాడుతూ తాను జగ్గయ్యపేట ఎస్ బి ఐ (పాత ఎస్ బి హెచ్)లో పెన్షన్ ఖాతా ఉందన్నారు. తన ఖాతాను బ్యాంకు వారు హోల్డ్‌లో పెట్టడంతో నగదు లావాదేవీలు జరుపుకోవటానికి వీల్లేకుండా పోయిందన్నారు. ఎలాంటి నోటీసు, సమాచారం తెలపకుండా ఖాతా ఆపటం సరికాదన్నారు. నిత్యావసరాలు తెచ్చుకోవటానికి ఇబ్బందులు పడ్డారన్నారు. ఆసుపత్రి ఖర్చులకు డబ్బులు లేవనీ, వేరే వారికి చెల్లించాల్సిన మొత్తాన్ని ఇవ్వలేకపోయాననీ, ఖాతా ఎందుకు ఆపారో తెలియటం లేదని పేర్కొన్నారు. బ్యాంకు మేనేజర్ బి.గోపీ సాగర్‌ను అడిగితే సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. 10 సంవత్సరాల క్రితం మిర్చి పెట్టుకున్న కోల్డ్ స్టోరేజ్ వాళ్ళు లోన్ తీసుకుంటే ఇప్పుడు ఈయన ఖాతా హోల్డ్ లో పెట్టామని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగులు ఇలా పలు కారణాలతో ఖాతాలు ఆగిపోయిన విశ్రాంత ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు నాయకులు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అగౌరవ పరిస్తే ఊరుకునేది లేదు : మీరా

ప్రజాశక్తి-నందిగామ

సామాజిక మధ్యామాల్లో దూదేకుల సంఘం అగౌరవ పరిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని నూర్ బాషా దూదేకుల నందిగామ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మీరా హెచ్చరించారు. గురువారం నందిగామ ఓసి క్లబ్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది నూర్ భాషా సభ్యులు పీర్ల చావిడిలో మీటింగ్ ఏర్పాటు చేస్తుండటం సరికాదన్నారు. ప్రస్తుత ప్రెసిడెంట్‌గా ఉన్న ఆజాద్ పదవీకాలం గురించి మాట్లాడటం తప్పుగా ఖండించారు. డిసెంబర్ నెలలో మీటింగ్ ఏర్పాటు చేస్తామని అప్పుడు ఎన్నికల ఎప్పుడు అనేది నిర్ణయిస్తామని అందరూ కలిసిమెలిసి ఉండాలని ప్రతి ఒక్కరూ సంఘానికి ఎంతో కొంత అభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు రహమాన్ మాస్టారు, షేక్ అస్సాన్, విజయటాకీస్ మీరా, అంకు సాహెబ్, చిన మీరా, తుర్లపాడు మీరా, చంటి,నాదస్వరం అస్సాన్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండలం శ్రీకాకుళం వద్ద ప్రమాదవశాత్తు కెఈబి కెనాల్‌లో పడి మహిళ మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల మేరకు శ్రీకాకుళం గ్రామానికి చెందిన అప్పాపురం సీతామహాలక్ష్మీ చెత్తపారేసేందుకు కెఈబి కెనాల్ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు సమాచారం.



మాట్లాడుతున్న అనగాని రవి

అభివృద్దే లక్ష్యంగా పనిచేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి-గన్నవరం

అభివృద్దే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీపీ అనగాని రవి అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల పనితీరుపై అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. అనంతరం రవి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సదుపాయలను కల్పించే దిశగా ప్రభుత్వ శాఖలు పనిచేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశంలో అయా శాఖల పనితీరుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలన్నారు. తద్వారా ఆ శాఖల పరిధిలో సమస్యల పరిష్కరానికి చర్యలు తీసుకోవచ్చునన్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీలో మౌళిక సదుపాయల కల్పన పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఇప్పటికే మండల పరిషత్ ద్వారా పలు కాలనీల్లో రోడ్డు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులను మండల పరిషత్ ద్వారా మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశానికి రెవెన్యూ, ఎక్సైజ్, గృహనిర్మాణ, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, పోలీస్, ఆర్‌అండ్‌బి వంటి కీలక శాఖల అధికారులు రాలేదు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ . గౌసాని . వైస్ ఎంపీపీ -2 కాలగడ్డ శివనాగరాజకుమారి , ఎంపీడీవో కె . వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న సింహాద్రి రమేష్‌బాబు

గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండలం మల్లంపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని చిలకలపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు గురువారం 330 గృహాలను సందర్శించారు. లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేశారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సీఎం ఆదేశాల మేరకు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొణతం విజయలక్ష్మీ, వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, ఎంపీటీసీ కొలుసు ఝాన్సీలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, కార్యదర్శి దిరిశం పిచ్చేశ్వరరావు, వైసీపీ యువనేతలు వేమూరి ప్రవీణ్, చిట్టూరి రమేష్, పీఏసీఏస్ చైర్పర్సన్ వేమూరి రత్న శేఖర్. కె.చంటి, శ్రీనివాస్, చికినం బాలాజీ, ఎంపిడివో కేవీ సుబ్బారావు, తహసీల్దార్ బి. రామా నాయర్, పీఆర్ ఏఈ జె.నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ జి.కిషోర్, ఈవో వైశివరామ ప్రసాద్, గ్రామ సచివాలయం, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



నగదును అందజేసిన సచివాలయ సిబ్బంది

మృతుడి కుటుంబానికి బీమా సాయం

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండలం తెలుగురావుపాలెం గ్రామ పంచాయతీలోని ఇటీవల గుండెపోటుతో ఘట్టమనేని శ్రీనాథ్ చౌదరి మృతిచెందారు. వైఎస్ఆర్ బీమాలో భాగంగా మట్టి ఖర్చులు నిమిత్తం మృతుని భార్యకు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని తెలుగురాపాలెం గ్రామ ఉపసర్పంచ్ దేవినేని పద్మప్రియ, పంచాయతీ సెక్రెటరీ గోల్కొండ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ కొల్లిపర రేవంత్, రావి కనకదుర్గ అందజేశారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

కార్తీక మాసం చివరిరోజు పురస్కరించుకుని ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర కమిటి అధ్యక్షులు ఎం ఏ కౌసర్ ఆధ్వర్యంలో గురువారం నగరంలో నిరుపేదలకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నగర ప్రధానకార్యదర్శి



భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు

ఎస్ కె షరీఫ్ మాట్లాడుతూ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాత్రికేయుల సంక్షేమ కోసం పోరాడుతూనే తమ వంతు సేవా కార్యక్రమాలు అందించాలని లక్ష్యంతోనే ముందుకు వెళ్తున్నామన్నారు. సేవా కార్యక్రమాల్లో కూడా ముందు పీఠిన నిలబడతామన్నారు. ఉపాధ్యక్షులు ఎస్ శశి భూషణ్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డి ఎస్ ఆర్ వి కే ప్రసాద్, జిల్లా నాయకులు కొడాలి శ్రీను, నగర కమిటీ గౌరవ అధ్యక్షులు కె.జాకబ్, కార్యవర్గ సభ్యులు ఎస్ సునీల్, పి ఫణి, సాయి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి ఎస్ఐకు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి-మోపిదేవి

మోపిదేవి మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కొద్ది రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన సిహెచ్ పద్మ సాధారణ తనిఖీల్లో భాగంగా మోపిదేవి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని



ఎస్ఐను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ నందిగం మేరీరాణి శాలువా, పూలమాలలతో గుచ్ఛాలతో గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కమ్మిలి త్రిపుర సుందరి, ఎంపీటీసీ సభ్యులు కొమ్ము పవన్ కుమార్, మోపిదేవి సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షులు కామిశెట్టి వెంకట సురేష్ బాబు, వార్డు సభ్యులు కేశగాని రాము, గ్రామస్తులు నందిగం అభిషేక రావు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-చల్లపల్లి

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవ్వరు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ డి.సందీప్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫ్లెక్సీ బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని అగంతకుడు మట్టి రాయటంపై ఫిర్యాదు అందినట్లు తెలిపారు.. దీనిపై వచ్చిన ఫిర్యాదు ప్రకారం జిల్లా ఎస్పి జాషువా ఆదేశాల మేరకు అవనిగడ్డ డిఎస్పి మహబూబ్ బాషా పర్యవేక్షణలో , చల్లపల్లి సిఐ బి.బి.రవి కుమార్ సూచనల ప్రకారం నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశామన్నారు. సాంకేతికతను ఉపయోగించుకొని చుట్టు ప్రక్కల ప్రత్యక్ష సాక్షులను విచారించి ప్రాథమిక విచారణ చేయగా మద్యం మత్తులో ఈసర్ల శివ అనే వ్యక్తి ఈ ఘటనకు పాల్పడినట్లుగా గుర్తించామన్నారు. అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా మద్యం మత్తులో ఉన్మాదిగా తానే సదరు ఘటనకు పాల్పడ్డానని అంగీకరించినట్లుగా చెప్పారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సందీప్ వివరించారు.

గుడివాడలో కొడాలి, గన్నవరంలో నేనే గెలిచేది

ఎంఎల్ఎ వంశీమోహన్

ప్రజాశక్తి-గన్నవరం : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గుడివాడ నుంచి కొడాలి నాని, గన్నవరం నుంచి తాను గెలిచి తీరుతామని ఎంఎల్ఎ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. గుడివాడలో కొడాలి, గన్నవరంలో తాను ఎప్పుడూ ప్రజలతో ఉంటాము తప్ప వారిని వదిలి ఎక్కడికి పారిపోమని అన్నారు. అందుకే ప్రజలు తమకు అండగా ఉండి గెలిపిస్తారని స్పష్టం చేశారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నోరు తెరిస్తే ఇవే తనకు చివరి ఎన్నికలు అని చెబుతున్నారని, ఎన్నికల్లో ఓడిపోతే కాడిపారేసి హైదరాబాద్ వెళ్లిపోతాననే సిగ్నల్స్ ఇస్తున్నారని అన్నారు. నిజం చెప్పాలంటే ఆయనకు ఇవే చివరి ఎన్నికలు అన్న విషయం అర్థమై పోయిందన్నారు. కుప్పంలో చంద్రబాబును, మంగళగిరిలో లోకేష్‌ను ఓడించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. ముందు వాళ్ళిద్దరూ అక్కడ గెలిచేందుకు ఏం చేయాలో చూసుకోవాలన్నారు.

రజకుల అభివృద్ధికి కృషి చేయాలి

రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగభూషణం

ప్రజాశక్తి-పామర్రు : రజక వృత్తిదారుల సంఘం కృష్ణాజిల్లా కమిటీ సమావేశం పామర్రులో గురువారం జరిగింది. ప్రజాసంఘాల కార్యాలయంలో పి.పాండురంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి కాటూరి నాగభూషణం మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం కొంతమందికి మాత్రమే ప్రభుత్వం అమలు చేయడం తగదన్నారు. రజక వృత్తిపై ఆధారపడి పని చేస్తున్న అందరికీ షాపులతో సంబంధం లేకుండా అందజేయాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా రజకులపై దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు ఆగలేదన్నారు. వీటిని ఎదుర్కోవడానికి రజకులంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన రజకులకు పింఛను ఇవ్వాలని కోరారు. జిఒ 343 ప్రకారం రజక వృత్తిదారులకు చెరువులు కేటాయించాలని, రజక కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు నిధులు కేటాయించి, రజక వృత్తిదారుల అభివృద్ధికి తోడ్పడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు చిక్కవరపు వెంకటరెడ్డయ్య, ఓగిరాల శ్రీను, పెందుర్తి మహేష్, కాటూరి ఘంటయ్య, వి. వంశీ, కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ల అందజేత

ప్రజాశక్తి - గన్నవరం : మండలంలోని వీరపనేనిగూడెం గ్రామంలోని గురుకుల పాఠశాల విద్యార్థులకు హిందీ ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష సర్టిఫికెట్లను అందజేశారు. ప్రాథమిక రాసిన 12 మంది, మధ్యమ 42 మంది, రాష్ట్ర భాష రాసిన ఐదుగురు విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



భూ యజమానులకు హక్కు పత్రాల పంపిణీకి సిద్ధం

జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : భూముల రీసర్వే పూర్తి అయిన గ్రామాలకు సంబంధించి ముద్రణ పూర్తి అయిన భూ హక్కు పత్రాలలోని వివరాలను పున:పరిశీలన చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, ప్రభుత్వ ముఖ్య సలహదారు అజయ్‌కలాం కు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సర్వే అధికారులతో గురువారం సిసిఎల్ఎ ప్రధాన కార్యాలయం నుండి ప్రభుత్వ ముఖ్య సలహదారు అజయ్‌కలాం వైయస్‌ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే ప్రక్రియపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు నగరంలోని ఆయన కార్యాలయం నుండి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భూముల రీసర్వే పనులు పూర్తి చేసిన 14 గ్రామాలకు సంబంధించి భూ హక్కు పత్రాల ముద్రణ ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. సర్వే పూర్తి అయిన గ్రామాలలో రికార్డులలోని వివరాలను క్షేత్రస్థాయి సర్వే వివరాలతో పున:పరిశీలన చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో భూ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు, వివాధాలకు తావులేకుండా శాశ్వత ప్రతిపాదికన నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని 41 గ్రామాలలో డ్రోన్ ఫ్లైయింగ్ పూర్తి చేశామన్నారు. రీ సర్వే పూర్తి అయిన గ్రామాలలో భూముల హద్దులను తెలిపే భూరక్ష హద్దు రాళ్ళను నాటె కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నామని కలెక్టర్ డిల్లీరావు ప్రభుత్వ ముఖ్య సలహదారుకు వివరించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్‌కుమార్, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికాడ్స్ ఆఫీసర్ కె. సూర్యరావు ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి


సచివాలయాన్ని ముట్టడించిన విద్యార్థులు

'గ్రీన్‌టెక్' తొలగించాలని విద్యార్థుల ర్యాలీ, రాస్తారోకో

విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి మాట్లాడుతూ 14 ఏళ్లుగా పాఠశాల నడుస్తుంటే నాలుగేళ్ల క్రితం దానికి అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. విద్యార్థులు, గ్రామ ప్రజల జీవితాలతో చెలగాటమాడొద్దని, దానిని తొలగించి విద్యార్థులు, ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు షేక్ గౌస్‌మియా, ఎస్.రామనాథం, షేక్ మీరాసాహెబ్, కోటా కష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

'గ్రీన్‌టెక్'పై చర్యలకు కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు

ప్రభుత్వ విప్ ఉదయభాను

గ్రీన్‌టెక్ ఎన్విరో సొల్యూషన్ కంపెనీ కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశామని జగ్గయ్యపేట ఎంఎల్ఎ, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయమై సంబంధిత అధికారులతో అప్పుడే మాట్లాడానని, అంతేగాక ఎంపిడిఒను, వైద్యాధికారులను అక్కడికి పంపామని తెలిపారు. మూడు నెలల క్రితం మున్సిపల్ కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి వారితో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆ కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాలలో వ్యవసాయంపై పారిశ్రామిక కాలుష్యం ప్రభావంపై శాస్త్రీయ అధ్యయనం చేసి నివారణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఎన్‌టిఆర జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు దష్టికి కూడా తీసుకెళ్లామని పేర్కొన్నారు.

ఆరు నెలల్లో తొలగిస్తామని యాజమాన్యం చెప్పింది

టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి మాడుగుల సురేష్

టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి మాడుగుల సురేష్, జిల్లా కార్యదర్శి జిల్లేపల్లి రాంబాబు తదితరులు గురువారం పాఠశాల హెచ్‌ఎం, ఆ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఆరు నెలల్లో ప్లాంట్‌ను తొలగిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. ఈకాలంలో విద్యార్థులకు, గ్రామ ప్రజలకు, చుట్టుపక్కల పంట పొలాలకు ఎటువంటి ఆస్తి, ప్రాణంనష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని లిఖితపూర్వకంగా లేఖ ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు.

'తూర్పు' బైపాస్‌పై కసరత్తు

వాహనాలతోపాటు బందరు పోర్టుకు వచ్చి వెళ్లే వాహనాలు కూడా విజయవాడ నగరం, గన్నవరంలోకి రాకుండా ప్రయాణిస్తాయి.

రియల్ భూమ్‌కు అవకాశం

తూర్పు బైపాస్ రానుండడంతో గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు, పెనమలూరు మండలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. దీని నిర్మాణం పూర్తయితే భూముల రేట్లు పెరుగుతాయని, గన్నవరం ప్రాంత అభివద్ధికీ మార్గం సుగమమవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఎకరం రూ.70 లక్షల నుండి కోటి రూపాయల వరకు విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. రహదారి నిర్మాణం పూర్తయితే ఎకరం ధర రూ.1.50 కోట్ల నుండి రూ.3 కోట్ల వరకు వెళుతుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెబుతున్నారు. ఈరహదారి పెద్ద అవుటపల్లి పొలాలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ భూముల పక్కనుండి దావాజీగూడెం, బూతి మిల్లిపాడు పొలాల మీదుగా వెన్నుతల, వెల్దిపాడు, తరిగొప్పల, తెన్నేరు గ్రామాల మీదుగా కంకిపాడు, పెనమలూరు మండలాల మీదుగా వెళుతుంది. జాతీయ రహదారికి ఆనుకుని అనేక కంపెనీలు, అపార్ట్మెంట్లు, న్యూ కాలనీలో వచ్చే పరిస్థితి ఉంటుందంటున్నారు. ఇప్పటికే కొంతమంది వ్యాపారులు భూములను కొనుగోలు చేస్తున్నారని తెలిసింది.

దళితులపై దాడులను అరికట్టాలి

ఏకగ్రీవంగా ఆమోదించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరింది. దళితలకు గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, దళితవాడలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, దళితుల శ్మశానాలను భూములను కేటాయించి అభివృద్ధి చేసి ఇవ్వాలని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్టును పకడ్బందీగా అమలు చేయాలని, 41 సిఆర్‌పిసి ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానించింది. ఈ మహాసభలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లాల కార్యదర్శులు జి.నటరాజ్, కోట కళ్యాణ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు మరింత పెరిగాయన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంతో దళితుల్లో డ్రాపవుట్స్ పెరుగుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ విధానాన్ని, తరగతుల విలీనాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులు ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న అసైన్డ్ భూములను ఇళ్ల స్థలాల పేరుతో ప్రభుత్వం లాక్కొని వారికి అన్యాయం చేస్తోందని విమర్శించారు. దళితులకు అమలు చేస్తున్న 27 రకాల సంక్షేమ పథకాలను ప్రభుత్వం రద్దు చేసిందని, వీటిని పునరుద్ధరించాలని కోరారు. దళితవాడల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, డ్రైనేజీలు నిర్మించాలని, శ్మశాన వాటికలకు రెండెకరాల భూమిని అభివద్ధి చేసి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దళితులకు మతం ఆధారంగా కాకుండా కుల ప్రాతిపదికన కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, నిలుపుదల చేసిన బ్యాగ్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డప్పు కళాకారులకు రూ.5 వేలు పింఛను ఇవ్వాలని, ప్రయాణాల్లో రాయితీ కల్పించాలని, ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను దళితుల అభివద్ధికే వినియోగించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో సంఘం నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు జి.క్రాంతి కుమార్, జి.నటరాజు, సహాయ కార్యదర్శులుగా జె.వెంకట్రావు, శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కుటుంబరావు, మోజేష్ ఎన్నికయ్యారు. కెవిపిఎస్ మండల గౌరవాధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబు, మహిళా నాయకురాలు ధనమ్మ పాల్గొన్నారు.


నూతన కమిటీ ఎన్నిక

సమన్వయకర్త బాధ్యతల నుంచి కొడాలి తొలగింపు

ఎంఎల్ఎ భూమనకు అప్పగింత

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : రాష్ట్రంలో వైసిపి పదువుల్లో మార్పులు జరిగాయి. ఎనిమిది జిల్లాల్లో వైసిపి అధ్యక్షులను మార్పు చేశారు. అలాగే పలువురు ప్రాంతీయ సమన్వయ కర్తలను మార్చారు. మార్పులో భాగంగా మాజీ మంత్రి, గుడివాడ శాసనసభ్యులు కొడాలి నానిని పల్నాడు జిల్లా సమన్వయకర్త బాధ్యతల నుండి తొలగించారు. కొడాలి నాని బాధ్యతను ఎంఎల్ఎ భూమన కరుణాకరరెడ్డికి, గుంటూరు జిల్లా బాధ్యతను కష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త మర్రి రాజశేఖర్‌కు అప్పగించారు. ఈ మూడు జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్తగా మర్రి రాజశేఖర్‌తోపాటు ఎంపి ఆళ్ల అయోధ్యరామిరెడ్డికి కొత్తగా బాధ్యతలిచ్చారు.



నాటుసారాపై అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు

నాటుసారా తయారీ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కోడూరు

కృష్ణాజిల్లా ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు కోడూరు మండల పరిధిలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో అవనిగడ్డ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో నాటు సారా తయారీ, అమ్మకాల గురించి గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాటు సారా, అక్రమ మద్యం, గంజాయి, గుట్కా కోడి పందాలు, పేకాటలు సంబంధించిన నేరాలపై సమాచారాన్ని 14500 నెంబరుకు తెలియపరచాలని గ్రామ ప్రజలను కోరారు. మత్తు పదార్థాలు వినియోగించడం ద్వారా ఆరోగ్యం పాడవడమే కాకుండా కుటుంబాలు కూడా చిన్నాభిన్నమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వీఆర్వోలు, సచివాలయ పోలీసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-నాగాయలంక

మండలకేంద్రమైన నాగాయలంకలోని శ్రీ వాసవీ



కన్యకా పరమేశ్వరీ సమన్విత పార్వతీ సమేత శ్రీ నగరేశ్వర స్వామివారి ఆలయంలో అర్చకులు బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో నగరేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అవనిగడ్డ సిఐ జి శ్రీనివాసరావు, శ్రీ రామపాదక్షేత్రం ఆలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. అవనిగడ్డ సిఐ జి.శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ స్వాగతించారు. కమిటీ సభ్యులు తాడికొండ సత్యనారాయణ, మునగాల కుటుంబరావు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, మానేపల్లి శ్రీనివాసరావు, ఆకుతోట సీతారామయ్య, దేశు సత్యనారాయణ, రాచంశెట్టి పాపారావు, ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

ఎస్ఐగా సుబ్రహ్మణ్యం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-నాగాయలంక

నాగాయలంక పోలీసుస్టేషన్ నూతన ఎస్ఐగా ఎం.సుబ్రహ్మణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు.



బాపులపాడు మండలం వీరవల్లి పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకి వచ్చారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే ఉండదన్నారు. ప్రజల సహకారంతో మంచి సేవలు అందించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఏఎస్ఐ బండారు కృష్ణమూర్తి, రైటర్ నల్లూరి వెంకటేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది నూతన ఎస్ఐ సుబ్రహ్మణ్యంకు సాదర స్వాగతం పలికారు.

మౌలిక వసతులు కల్పించాలి : పేర్ని

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో గో సంఘం వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయంలో అన్ని మౌలిక సదుపాయాలు



వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, కృష్ణా వైసిపి అధ్యక్షులు, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) సంబంధిత అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం నగరంలోని 32 వ డివిజన్ పరిధిలోని గో సంఘం సమీపంలో జి ప్లస్ త్రీ ఇళ్ల వద్ద రూ.1.47 కోట్లతో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం టిడ్కో ఇంజనీర్లు, పలువురు లబ్దిదారులతో కలిసి గృహాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాల పనుల పురోగతి, పెండింగ్ పనుల పూర్తిచేయడం, ఎస్టీపీల నిర్మాణాలపై అధికారులతో ఎమ్మెల్యే పేర్ని నాని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.10.56 కోట్లతో పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. త్రాగునీటి సౌకర్యం, డ్రైనేజీ నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంకులు, పార్కులు తదితర మౌలిక సదుపాయాలతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణం, పైపులైన్లు, విద్యుదీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి, సకాలంలో గృహాలను లబ్దిదారులకు అందించగలమన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ తంటిపూడి కవితా థామస్ నోబుల్, డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, ద్వామా పిడి జి.వి.సూర్యనారాయణ,టిడ్కో ఎస్ఇ బి.చిన్నోడు, డీఈ సుధాకర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోదుగుమూడి గణేష్ బాబు, బొర్రా విఠల్, లంకె వెంకటేశ్వరరావు, షేక్ సలార్ దాదా, బూరగడ్డ రమేష్ నాయుడు, 32వ డివిజన్ కార్పొరేటర్ చింతా వెంకటేశ్వర రావు, ఇంఛార్జి చింతా మౌనిక, కార్పొరేటర్లు, ఇన్‌ఛార్జిలు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, మున్సిపల్ కమిషనర్ జి.చంద్రయ్య, మున్సిపల్ ఇంజనీర్ పి.శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎం.సుగుణ పాల్గొన్నారు.

ప్రతిభగల క్రీడాకారులకు ప్రాధాన్యత : ఎంఇఒ

ప్రజాశక్తి-గన్నవరం

ప్రతిభ గల క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందనీ, బాలబాలికల సద్వినియోగం చేసుకోవాలని గన్నవరం మండల విద్యాశాఖ అధికారి బి.శ్రీనివాస్ సూచించారు. కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 బాల,బాలికల ఫెన్సింగ్ ఎంపికలు ఎస్. జి. ఎఫ్. అండర్ 19 కృష్ణా జిల్లా కార్యదర్శి వి.రవికాంత సూచనల మేరకు గురువారం నాడు గన్నవరంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉత్సాహంగా జరిగాయి. కృష్ణాజిల్లా ఫెన్సింగ్ కార్యనిర్వాహక కార్యదర్శి ధనియాల నాగరాజు అధ్యక్షత వహించారు. విద్యార్థులు చదువుతోపాటు,క్రీడలకు కూడా



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఇఒ శ్రీనివాస్

సమాన ప్రాధాన్యత కల్పించి ముందుకు వెళ్లాలన్నారు. అప్పుడే అన్ని రంగాల్లో చురుగ్గా రాణించగలరన్నారు. ఉత్తమ క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిహెచ్.అనిత మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తారన్నారు. గన్నవరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.బాలకృష్ణారావు మాట్లాడుతూ క్రీడాకారులకు తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కె.వెంకయ్య మాట్లాడుతూ బాల, బాలికల జట్లు విజయంతో తిరిగి రావాలని కోరారు. గన్నవరం మూడో వార్డు సభ్యురాలు వద్దాది దుర్గ ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌జిఎఫ్ అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ పరిశీలకులు ప్రసాద్ పర్యవేక్షించారు. ధనియాల నాగరాజు ఎంపికలను విజయవంతంగా నిర్వహించారు. శ్రీ దేవ శేషు, శ్రీనివాస్, చార్లెస్, సి ఆర్ పి ఎస్ వెంకట్ పాల్గొన్నారు.

'5జి సేవలతో విప్లవాత్మక మార్పులు'

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

విద్యార్థుల సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు ఉత్తేజపరిచే క్రమంలో స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి ఐఇఇఇ స్టూడెంట్ టాలెంట్ హంట్ -2022 గురువారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వి ఎస్ ఎన్ ఆర్ వి ప్రసాద్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఐటిఎస్ డైరెక్టర్ జివి మనోజ్ కుమార్ మాట్లాడారు. నైపుణ్య ఆంధ్రప్రదేశ్ ప్రచారాన్ని ప్రోత్సహించడంలో భాగంగా నూతన 5జి ఆవిష్కరణలు, ఎం టు ఎం కమ్యూనికేషన్స్,



మాట్లాడుతున్న ప్రసాద్

కృత్రిమ మేధస్సు, జీవన విధానంలో భాగమైన అంతర్జాల ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి.కరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి భక్తి, శ్రద్ధాశక్తులతో కూడిన సాంకేతిక నిపుణత అవసరమని విద్యార్థులకు ప్రతిభా దిక్సూచిగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. కార్యక్రమం కౌన్సిలర్ డాక్టర్ ఎం.కామరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 20 ఇంజనీరింగ్ కళాశాలలలోని వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొని వినూత్న ప్రాజెక్టులు, పరిశోధనా పత్రాలు, మనోవికాస కార్యక్రమాలను ప్రదర్శించారని తెలిపారు. ఐఇఇఇ గుంటూరు ఉప విభాగం సాంకేతిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం ఆర్ సి హెచ్ శాస్త్రి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ వై.రామకృష్ణ, డాక్టర్ బి.దాసు, ఇ.వర్గిల్ కుమార్, టి.ఆనంద్ బాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థి స్వచ్ఛ కార్య నిర్వాహకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓర్వలేకే ఫ్లెక్సీలపై బురద : సింహాద్రి

ప్రజాశక్తి-చల్లపల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే తెలుగుదేశం పార్టీ నాయకులు ఇలాంటి ఉన్మాదపు, పిచ్చి పనులు చేస్తున్నారని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు విమర్శించారు. స్థానిక ఎన్టీఆర్ పార్క్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు



ముఖ్యమంత్రి జగన్ ఫ్లెక్సీపై బురద పోశారు. స్థానిక వైసిపి నాయకులు ఇచ్చిన సమాచారంతో ఆయన చల్లపల్లి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని తరగతుల ప్రజల సంక్షేమానికి సిఎం వైఎస్ జగన్ కృషిచేస్తున్నారన్నారు. పేదల హృదయాల్లో ఆయన పదిలంగా ఉన్నారన్నారు. గాంధీ విగ్రహం వద్ద 104 వాహనం ద్వారా పేద ప్రజలకు మందులు పంపిణీ చేస్తుంటే ఆ ప్రాంతంలో ఫెన్సింగ్ వెయ్యటంపై మండిపడ్డారు. పేద ప్రజల అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చేసే కుటిల ప్రయత్నాలు ఫలించబోవన్నారు. వాళ్లు ఎన్ని కుట్రలు చేసినా జగన్మోహన్ రెడ్డిని అడ్డుకోలేరన్నారు. అనంతరం జగన్మోహనరెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, మాజేరు, లక్ష్మీపురం, వక్కలగడ్డ సర్పంచులు కల్లేపల్లి లక్ష్మి, కొల్లూరు వెంకటేశ్వరరావు, వల్లూరి ఉమా, పిఎసిఎస్ చైర్ పర్సన్ ఆరజా శివశంకర్, పాగోలు నాగ పోతరాజు (ఫణి), శ్రీరామమూర్తి, స్థానిక నాయకులు పాల్గొన్నారు

సున్నా వడ్డీ వర్తింపచేయాలి

ప్రజాశక్తి-కోడూరు

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలనీ, రూ.లక్ష లోపు రుణం తీసుకున్న వారందరికీ సున్నా వడ్డీ వర్తింపజేయాలని ఎపి రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోడూరు మండలంలో వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో 2019-2020 సంవత్సరాలకు గాను రైతులకు కేవలం 10 నుంచి 15 శాతం మందికి మాత్రమే సున్నా వడ్డీ వర్తించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2020- 2021 సంవత్సరాలకు గాను ఈ నెల 28న సున్నా వడ్డీ విడుదల చేయనున్నట్లు ఒక ప్రకటన ద్వారా తెలిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేతలు జొన్నలగడ్డ రాజగోపాలరావు, చెక్క వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, కీర్తిశేషురాలు వీరాబత్తిన రత్నకుమారి 50వ జన్మదినం సందర్భంగా మెగా వైద్య శిబిరాన్ని స్థానిక లయన్స్ సేవా భవనంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు వీరాబత్తిన రాంబాబు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఎముకలు కండరాల వైద్య నిపుణులు డాక్టర్ నిమ్మగడ్డ రాజా, గుండె జబ్బుల డాక్టర్ పైనీ బిల, నరాల వైద్యుని నిపుణులు డాక్టర్ సుమతి జరుగు, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ సాదుపాటి దుర్గాప్రసాద్ , శిశు వైద్యుని నిపుణులు డాక్టర్ చల్లా బ్యూలా రాణి లు ఉచిత వైద్య సేవలు అందిస్తారు. ఈ శిబిరంలో బిపి, ఎఫ్‌బి ఎస్, పిపిబిఎస్, ఈసీజీ, స్యూరోపతి పాదపరీక్ష, లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలు ఉచితంగా చేసి ఉచిత మందులు అందజేస్తారు. ఈ శిబిరాన్ని మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

త్రివేణి విద్యార్థుల ప్రతిభ

గుడివాడ : స్థానిక పా గులాబ్ చంద్ జీవావత్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను భాగంగా వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, దేశభక్తి, చిత్రలేఖనం తదితర పోటీలలో త్రివేణి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వివిధ విభాగాలలో జరిగిన పోటీలలో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ ఎస్. శివశంకర్ తెలిపారు. స్థానిక త్రివేణి పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విఎంసి సొసైటీ ఎన్నికలకు నామినేషన్లు

• 4న పోలింగ్ • మొత్తం ఓట్లు 1533

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ మునిసిప్ కార్పొరేషన్ (విఎంసి) ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికల నామినేషన్ దాఖలు ప్రక్రియ 25వ తేదీ శుక్రవారం జరగనుంది. దుర్గాఅగ్రహారంలోని సొసైటీ బ్యాంక్ కార్యాలయం పైఅంతస్తులో నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ల పరిశీలన సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ ఈ నెల 26 సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుంది. హనుమాన్‌పేటలోని డాక్టర్ దక్షిణామూర్తి మునిసిపల్ హైస్కూల్‌లో పోలింగ్ వచ్చే నెల 4వ తేదీన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభించి రాత్రిలోపు ఎన్నికల అధికారి ఫలితాలను వెల్లడిస్తారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే సొసైటీ బ్యాంకు ఎన్నికల్లో 11 మందిని పాలకవర్గం సభ్యులుగా ఎన్నుకుంటారు. ఎన్నికల అధికారిగా డిప్యూటీ రిజిస్ట్రార్ (రిటైర్డ్) ఎంజె ఏసుదాస్ వ్యవహరిస్తున్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన ఈ నెల 18 నుంచే ఆయా సంఘాలు తమ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఈ సారి మూడు సంఘాలు ఎన్నికల బరిలో ఉన్నాయి. గత సారి జరిగిన ఎన్నికల్లో ప్రొగ్రెసివ్ ఫ్రెంట్ ప్యానల్ (ప్రస్తుతం ఉన్న) విజయం సాధించింది. ఈ సారి ప్రొగ్రెసివ్ ఫ్రెంట్, ఈశ్వర్ ప్యానల్, విఎంసి ఎంప్లాయిస్ మినిస్ట్రీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బలపరిచిన ప్యానల్ ఎన్నికల బరిలో ఉన్నాయి. విధులు నిర్వహిస్తూనే ఆయా ప్యానల్స్ తమ ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న ట్రెండ్‌ను బట్టి ప్రొగ్రెసివ్ ఫ్రంట్, ఈశ్వర్ ప్యానల్ మధ్యనే ప్రధాన పోటీ నెలకొన్నట్లు ప్రచారం జరుగుతుంది.

గెలుపునకు కీలకం ఉపాధ్యాయుల ఓట్లే

సొసైటీ ఎన్నికల్లో గెలుపునకు మునిసిపల్ ఉపాధ్యాయులు అత్యంత కీలకంగా ఉన్నారు. సొసైటీ పరిధిలో మొత్తం 1533 ఓట్లకు ఉపాధ్యాయుల ఓట్లే 400కు పైగా ఉన్నాయి. ఆ తరువాత పబ్లిక్‌హెల్త్ విభాగంనకు చెందిన ఓట్లు 300కు పైగా ఉన్నాయి. ఈ సారి కూడా తమను గెలిపించినట్లయితే సొసైటీ బ్యాంక్ అభివృద్ధితో పాటు, ఉద్యోగులకు మెరుగైన సేవలు అందిస్తామని గత ఐదు సంవత్సరాలు నిర్వర్తించిన కార్యకలాపాల నివేదికతో ప్రొగ్రెసివ్ ఫ్రంట్ తమ ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. గతంలో తాము చేసిన అభివృద్ధి, ఇంకా రానున్న రోజుల్లో ఉద్యోగులకు మరిన్ని సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామని ఈశ్వర్ ప్యానల్ ప్రచారం చేస్తుంటే... ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మూడో ప్యానల్ చెప్పుకుంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు.



వివరాలు తెలియజేస్తున్న రమణమూర్తి

ఆంధ్రా ఆస్పత్రిలో అరుదైన లాపరోస్కోపీ సర్జరీ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఆంధ్రా ఆసుపత్రిలో యూరినరీ బ్లాడర్ క్యాన్సర్‌ను నిరోధించేందుకు వైద్యులు చేసిన అరుదైన లాపరోస్కోపీ సర్జరీ విజయవంతంగా జరిగింది. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రా హాస్పటల్స్ అధినేత పి.వి.రమణమూర్తి మాట్లాడుతూ ఉయ్యూరులో నివసించే 75 ఏళ్ల మహిళ రెండు నెలల పాటు తీవ్రమైన మూత్ర విసర్జన లక్షణాలతో బాధపడుతోందన్నారు. అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి ఆమెకు అరుదైన మూత్రాశయ కణితి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆంధ్రా హాస్పిటల్‌లో వైద్య నిపుణుల బృందంతో కలిసి డాక్టర్ కౌషిక్ ఆమంచర్ల లాపరోస్కోపిక్ పాక్షిక సిస్టెక్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆంధ్రా హాస్పిటల్స్ లాపరోస్కోపిక్ సర్జరీల కోసం ఒక అపెక్స్ సెంటర్‌ను నిర్వహిస్తుందన్నారు



'ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి'

ప్రజాశక్తి-గంపలగూడెం: జిల్లాలో రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షులు గువ్వల సీతారామిరెడ్డి కోరారు. గురువారం కనుమూరులో రైతు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మడాన్ని పరిశీలించారు. ఆరుగాలం రైతు అనేక కష్టాలకు, నష్టాలకు ఓర్చి పండిస్తే నేడు ఆ పంటను అమ్ముకునేందుకు కూడా దిక్కులేకపోవడం దురదృష్టకరమన్నారు. పొరుగు రాష్ట్రాల నుండి అమూల్ పాల కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేసి బలవంతంగా రైతుల నుండి పాలను సేకరించే ఈ ప్రభుత్వం రైతు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామాల్లో ఉన్న ఆర్బికేల ద్వారా ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ఉద్యోగులకు ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-విజయవాడ: ఎపిసిపిడిసిఎల్ వారి కార్యాలయంలోని విద్యుత్ ఉద్యోగులకు రమేష్ హాస్పిటల్ ద్వారా ఉచిత మెడికల్ క్యాంప్‌ను గురువారం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో షుగర్, బిపి, ఇసిజి, ఇసిఒ టెస్టు, గుండె సంబంధిత సేవలను హాస్పిటల్ వైద్యులు అందించారు. విద్యుత్ ఉద్యోగులకు తగిన సూచనలు, సలహాలను డాక్టర్లు అందించారు. తరుచూ ఉద్యోగులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు కోరారు. ప్రముఖ గుండె సంబంధిత డాక్టర్ సుకన్య, డాక్టర్ కృష్ణభార్గవ్ ఆధ్వర్యంలో వైద్యసేవలను అందించారు. వైద్యశాల పిఆర్ఒ ప్రేమ్ బహుదూర్, ఎపిసిపిడిసిఎల్ ఆపరేషన్ సూపరిటిండెంగ్ ఇంజినీర్ ఎం శివప్రసాదరెడ్డి, ప్లానింగ్ సిజిఎం డి సుబ్బారావు, టెక్నికల్ ఎగ్జిక్యూటవ్ ఇంజినీర్ యు హనుమయ్య, నగర ఆపరేషన్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బివి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరుపై స్థానిక ఐవి ప్యాలస్‌లో యుసిడి విభాగం ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా యుసిడి ప్రాజెక్టు ఆఫీసర్ కె శకుంతల పలు అంశాలపై వివరించారు. పేదలందరికీ ఇళ్లు, ఎస్‌హెచ్‌జి లబ్దిదారుల వాటా ధనం, ఎస్‌హెచ్‌జి సభ్యులుగా లేని లబ్దిదారులను కొత్త ఎస్‌హెచ్‌జి సభ్యులుగా చేర్పించాల్సిన ప్రాధాన్యతపై పి.ఒ వివరించారు. లబ్దిదారుల వాటాను సంఘాలలో తీర్మానం చేసి, సున్నా వడ్డీపై రుణాలను బ్యాంక్‌ల ద్వారా ఇప్పించాల్సిన ఆవశ్యకతను ఆమె తెలిపారు. టిడ్కో రుణాలు వంద శాతంను పూర్తి చేయాలన్నారు. ఆసరా స్కీమ్ సభ్యుల బయో మెట్రిక్ తప్పని సరిగా తీసుకోవాల్సి ఉందన్నారు. జగనన్న తోడు, పిఎం స్వా నిధి, వంద శాతం రుణాల మంజూరు చేసే అంశాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. వైఎస్ఆర్ చేయూత లబ్దిదారులకు చేస్తున్న యూనిట్స్‌ను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉందని, ఈ అంశాలన్నింటినీ ఫీల్డ్ స్టాఫ్ తప్పని సరిగా అమలు చేయాల్సి ఉందని పిఒ శకుంతల కోరారు. ఈ సమావేశంలో మూడు సర్కిల్స్ జోనల్‌కమిషనర్లు టి సుధాకర్, కె అంబేద్కర్, డాక్టర్ ఎ రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శకుంతల

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-తిరువూరు: మండలంలోని టేకులపల్లి సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షు లు మక్కామల సీతారామయ్య, రైతు లతో కలిసి ప్రారంభించిన జడ్పిటిసి యరమల రామచంద్రారెడ్డి మాట్లాడు తూ దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోకుండా ప్రభుత్వం మద్ధతు ధర ఇస్తున్న కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ వేముల వెంకటకృష్ణారావు, ఉయ్యూరు కృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులు సివిల్స్‌లో రాణించాలి

యుపిఎస్‌సి సివిల్స్ పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి బొత్స

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు సివిల్స్‌లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలని, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి అందుబాటులో సివిల్స్ కోచింగ్ ఉండాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం నగరంలోని ఎం.జి.రోడ్డులోని ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శరత్‌చంద్ర ఐఎఎస్ అకాడమి రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విడుదల చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడగలుగుతున్నారని ఆవిధంగా విద్యా విధానంలో మార్పులు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సబ్జెక్టుతో పాటు అన్ని రంగాల్లో పట్టు సాధించే విధంగా మౌళిక మార్పులు చేశామని ముఖ్యంగా ఇంగ్లీషు మీడియం బోధనకు మంచి స్పందన లభిస్తుందన్నారు. శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు కోచింగ్ ఇవ్వడంతో పాటు యుపిఎస్‌సి సివిల్స్ పరీక్షల్లో వస్తున్న మార్పులను ఎప్పటికపుడు తెలియచేసేందుకు ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను రూపొందించినట్లు తెలిపారు. పుస్తకాల తయారీలో శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమి అధ్యాపకులు ఎంతో కృషి చేశారని నిష్ణాతులైన ప్యానెల్ మెంబర్స్‌తో కూడిన కమిటీ మెటీరియల్‌ను రివ్యూ చేసి రూపొందించినట్లు తెలిపారు. ఇటీవల ఐఎఎస్‌లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమీ విద్యార్థులు కూడా పుస్తకాల తయారీలో సహకారం అందించినట్లు తెలిపారు.



29న సబ్ జూనియర్ సాఫ్ట్‌టెన్నిస్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: కృష్ణాజిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దారం నవీన్ కుమార్ తెలిపారు. ఎంపికైన జట్లు డిసెంబర్ 3, 4 తేదీల్లో కర్నూలులో జరుగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్షిప్, రాష్ట్ర జట్ల ఎంపికల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 29వ తేదీ ఉదయం ఏడు గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. 1.1.2007 తరువాత పుట్టిన వారు ఎంపికల్లో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు.